క్లుప్తంగా

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పారిశ్రామిక వేత్త సుబ్రమణ్యం

బంగారుపాళెం: మండలంలోని కూర్మాయిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో మంగళవారం దాతల సహకారంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామానికి చెందిన దాత కరణం రుక్మిణమ్మ తన భర్త చెంగల్రాయ పిళ్లై, కోడలు గీతాంజలి జ్ఞాపకార్థం గ్రామంలో రూ.5 లక్షలతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్త సుబ్రమణ్యం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో దాత ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కరణం సుధాకర్‌పిళ్లై, దొరస్వామిరెడ్డి, జయకుమార్, రాజారెడ్డి, గురునాథంరెడ్డి, జగదీష్‌రెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ లైట్ల వితరణ



లైట్లను అందజేస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం బాలాజీకాలనీలోని శ్రీవినాయకస్వామి ఆలయానికి మంగళవారం దాత పార్థసారథి నాయుడు రూ.10 వేల విలువ చేసే విద్యుత్ లైట్లను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. గతంలో కూడా ఆయన ఆలయానికి గ్రానైట్ ఖర్చుల నిమిత్తం నగదు విరాళమిచ్చారని నిర్వాహకులు మాధవ, భానుమతి, శక్తివేల్ చెప్పారు.

కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బంగారుపాళెం: మండలంలోని 170 గొల్లపల్లె, టేకుమంద, బంగారుపాళెంలో మంగళవారం సాయంత్రం సీఐ లక్షుమయ్య ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మీదుగా రాగిమానుపెంట క్రాస్ వరకు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించామన్నారు. ప్రజలు తమ ఓటు నిర్భయంగా వేసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారా కలిగిన వ్యక్తులను అరెస్టు చూపుతున్న సెబ్ అధికారులు

బంగారుపాళెం: నాటుసారా కలిగిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి నట్లు చిత్తూరు రూరల్ సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మండలంలోని రామరాజుపురానికి చెందిన మునస్వామిరాజు, శంకర్‌రాజు ప్లాస్టిక్ క్యాన్‌లో 5 లీటర్ల నాటు సారా తీసుకువెళ్తుండగా రాగిమానుపెంట సమీపంలో అరెస్టు చేశారు. వారి వద్ద సాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా నాటుసారా, మద్యం విక్రయాలపై 9492814414కు సమాచారం అందివ్వాలని కోరారు. ఎస్ఐ నాగరాజు, సిబ్బంది అలెగ్జాండర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: కామ్రేడ్ చంద్ర రాజేశ్వర రావు 30వ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు నగరంలో మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన ఆయన తన ఆస్తిని సైతం నిరుపేదలకు పంచిన సేవాశీలి అని స్మరించారు. ఆయన ఆశయసాధన కోసం అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజన్ నాయకులు బాలాజీరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంటలు ఆర్పారు

చిత్తూరు అర్బన్: స్థానిక లెనిన్ నగర్‌లోని మునిసిపల్ కంపోస్టు యార్డులో ఎట్టకేలకు మంటలను ఆర్పారు. సోమవారం ఇక్కడున్న యార్డులో చెత్తకుప్పలకు నిప్పు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మూడు ఫైర్ ఇంజిన్లతో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పారు.

ప్రజలే కూటమిని మడతబెడతారు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- పచ్చనపల్లెలో జోరుగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమిని ప్రజలే మడతబెడతారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం పచ్చనపల్లె పంచాయతీలో మంగళవారం జోరుగా ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ హంస, నాయకులు వేలుస్వామి, ఏ.శేఖర్, ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. డప్పు దరువుకు మహిళలు, యువకులతో కలిసి విజయానందరెడ్డి చిందులేస్తూ ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉగాది పండుగ రోజు ఎన్నికల ప్రచారానికి పచ్చనిపల్లె పచ్చని తోరణం కట్టిందన్నారు. ఈ జనాభిమానం చివరి వరకు ఇలానే ఉండాలని..జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయేనని స్పష్టం చేశారు. జన బలం ఉన్న జగనన్నను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కూటమిగా జత కట్టాయని, టీడీపీ ఒక్కటే పోటీ చేస్తే ఓటమి తథ్యమని గ్రహించిన జనసేన, బీజేపీ, ఇతర పార్టీలు జత కట్టాయన్నారు. సిద్ధం బస్సు యాత్రలో జన ప్రభంజనం చూసి కూటమి నాయకులు గుండెల్లో రైలు పరుగెడుతున్నాయన్నారు. ఎన్నికల గెలవడానికి టీడీపీ చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో కూటమి నాయకుల కుర్చీని మడతపెట్టి ఇంటికి పంపడం తథ్యమని జోస్యం చెప్పారు. ఊరంతా ఏకమై గ్రామంలో అత్యధిక ఓట్లు వచ్చేలా చూడాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, ఎంపీటీసీ శోభి, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, పాండియన్, సాండ్లీ, కన్నన్, దిలీప్, కుమార్, జయరాం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపిస్తే రోజూ ఉగాది

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న మళ్లీ అధికారంలో వస్తే ప్రజలకు రోజూ ఉగాది పండుగలా ఉంటుందని, సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక కాజూరులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా కరపత్ర ప్రచారం చేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదల ఆర్థిక స్థితిగతుల్లో పలు సంక్షేమ పథకాలతో మార్పు తెచ్చారని, అన్ని వర్గాలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఆయన పథకాల ఫలాలను అర్హుల ముంగిటకే చేర్చుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలతో మళ్లీ ప్రజలను బురిడీ కొట్టేందుకు యత్నిస్తున్న టీడీపీ కూటమికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాజూరులో పర్యటిస్తున్న విజయానందరెడ్డి

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎంపీ రెడ్డెప్ప, సునీల్‌కుమార్, నాయకులు, ముస్లింలు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో మంగళవారం సాయంత్రం ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. స్థానిక జామియా మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజులపాటు ఉపవాస దీక్ష చేపట్టడం సంతోషకరమన్నారు. అల్లా ఆశీస్సులతో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. రంజాన్ పండుగ పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, నియోజకవర్గ పరిశీలకులు మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, నాయకులు కృష్ణమూర్తి, ఫిరోజ్, ప్రవీణ్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, హిదాయత్ పాల్గొన్నారు.

బైక్ సహా కర్ణాటక మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లి: మోటార్ సైకిల్‌తో సహా కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ క్రిష్ణయ్య మంగళవారం తెలిపిన వివరాలు..కైగల్ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవేలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌లో వచ్చిన ఓ యువకుడిని తనిఖీ చేయగా అతడి వద్ద 864 కర్ణాటక రాష్ట్రానికి చెందిన టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. కూటాలవంక గ్రామానికి చెందిన నటరాజ్ అని ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తనిఖీలలో బైరెడ్డిపల్లె పోలీసులు పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనం కల్పించి, వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశులు, ఆర్డీఓ చిన్నయ్య, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు చోరీ




ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పూతలపట్టు: ఆలయ హుండీలో పగలగొట్టి నగదు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ శ్రీనివాసపురంలోని శ్రీవేంకటేశ్వరాలయానికి తాళం వేసి సోమవారం రాత్రి ఆలయ నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. మంగళవారం తెల్లవారుజామున 1 నుంచి 5 గంటల ప్రాంతంలో ఆలయంలో దొంగలు పడ్డారు. హుండీని పగలగొట్టి నగదును అపహరించారు. మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాల కోసం ఆలయానికి వచ్చిన పూజారి, నిర్వాహకులు తలుపులు తెరిచి ఉండడం చూసి దొంగలు పడినట్టు గ్రహించారు. సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. హుండీలో సుమారు రూ.30 వేల నుంచి రూ. 40 వేల మధ్య ఉంటుందని స్థానికులు తెలిపారు.

నాలుక మడత పెట్టి..

జింగిచకా..జింగిచకా..!



- అప్పుడో మాట..ఇప్పుడో మాట!
- పాత వీడియోల్లో అలా..
- కొత్త వీడియోల్లో ఇలా..

“హరన్నా..! ఈ నాయకులు చెప్పే మాటలు సెల్‌ఫోన్లో చూస్తాంటే వీళ్లని ఎట్లా నమ్మాల్లో నాకైతే దిక్కు తెలీలేదన్నా అన్నాడు శివ. నేను ఫోనులో వీడియోలు చూస్తాంటే ఒకటే డౌట్లొస్తాందాయన్నా... ఇప్పుడు కూటమిలో నాయకులుండారు గదా.. చంద్రబాబన్న ఇంతకు ముందు కాంగ్రెస్సోళ్లతో చెయ్యి కలిపి, మనదేశంలో 26 పార్టీలను ఒక్కటి చేసి, పీఎం నరేంద్రమోదీని పెళ్లాం లేనోడు.. దేశాన్ని ఏం పాలిస్తాడు?.. ఆయన అధికారంలోకొస్తే సాయిబులోళ్లపై దాడులు తప్పవు..మసీదులుండవని మైకులు వణికేలా గట్టిగా అరచి..అరచి చెప్పినాడు కదనా..మరి మొన్నటికి మొన్న చిలకలూరిపేటలో ఇదే పెద్దమనిషి అబ్బబ్బబ్బా..! నాలుక ఏం మడత తిప్పేస్నాడునా..! మోదీని జింగిచకా..జింగిచకా అని ఏం భజన చేస్నాడునా?.. రెండు వీడియోలు చూసినా.. నేను దేన్ని నమ్మాల్లో అర్థమే కాలేదన్నా..”అని రాజకీయ జగన్నాటకం మీద ఆపకుండా చెప్పుకొచ్చినాడు.. “ఔనుబా.. శివా నిజమే.. నేనూకూడా చూస్నా.. పవన్‌కళ్యాణేమైనా తక్కువనుకుంటివా..? పోయినతూరి ఎలక్షన్‌లో చంద్రబాబుని ఎన్ని తిట్టలేదు చెప్పు?.. రాజధాని అమరావతి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారమని, చంద్రబాబు అండ్‌కో ఇక్కడి భూములను తక్కువ రేటుకు కొట్టేసి..కోట్లు..కోట్లు కొట్టేసినారని ఊగి..ఊగి..‘పవన్‌తాండవం’ చేస్నాడు కదా..చంద్రబాబును దించేస్తాం..పొడిచేస్తాం..అని ఓ అని పీక తెగేలా అరిచిన ఆయన..చంద్రబాబును జైల్లో కలిస్నాక నాలుక మడత పెట్టేస్నాడు కదా!? ఆయన బాబుకే జై కొట్టేకాడికి ఆ గ్లాసు పార్టీ వోళ్లకే మైండ్ బ్లాకైంది కదబా..అయన కూడా చంద్రబాబును జింగిచక..జింగిచకా అని పొగడ్తాండాడు.. అంతేకాదు బా..మళ్లీ బీజేపీ వోళ్లని కూడా ‘సైకిలెక్కిపిచ్చి’ ఈయన డబ్బానే కాకుండా వాళ్లందరి డబ్బా కూడా కొడతాంటే భలే కామెడీగుందియా! జెనసేనోళ్లు జెనాల కాడికిబోయినప్పుడు జెనాలు అడిగే మాటలకి తలకాయలు యాడబెట్టుకోవాలో తెలీక ‘పగిలిన గ్లాసు’లో టీ తాగేసి తలకాయలు దించుకుని పోతాండరంట..! పగోడికి కూడా ఈ మాదిరి రాకూడదుయా..అట్లే షర్మిలక్క, పురంధేశ్వరక్క వీడియోలు కూడా చూస్తాంటే వాళ్లూ ఇంతేయా.. సెల్‌ఫోన్ ఎత్తితే కొత్త వీడియో.. దానిపక్కనే వాళ్ల పాత వీడియోలు కనిపిస్తాండాయి.. ఇప్పుడు వీళ్లు మాట్లాడిని కొత్త వీడియోలు చూస్తే వీళ్లనెవరైనా నమ్ముతారా శివా..? అంతా నాలుక మడత పెట్నోళ్లేయా సామీ..” అని హరి ముక్తాయింపునిచ్చాడు. ఆపై ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

–పలమనేరు

భానుడు భగ..భగ

- గణనీయంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 10 గంటలకే భగభగలు
- వేడిగాలులతో అల్లాడుతున్న ప్రజలు
- రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు



నిర్మానుష్యంగా ఉన్న నగరంలోని గాంధీ సర్కిల్



ఎండ వేడిమికి స్కార్ఫ్ చుట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ

చిత్తూరు కలెక్టరేట్ : ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ ఉపకరణాల వాడకం పెరుగుతోంది. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌ల వాడకం పెరిగింది. దీంతో వారం రోజులుగా విద్యుత్ వినియోగం సైతం పెరిగిందని అధికారులు చెప్పారు. మరోవైపు మార్కెట్‌లో విద్యుత్ ఉపకరణాల విక్రయాలు దాదాపు 30 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఈసారి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించింది. కొన్ని రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కపోత ధాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఉదయం 10 గంటలకే భగ భగలు

ఉదయం 10 గంటలకే సూరీడు చుర్రుమంటున్నాడు. ఈ నెల 7, 8వ తేదీల్లో పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె మండలంలో 40 నుంచి 42.3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. రోహిణీ కార్తె రాక ముందే ఎండలు మండుతుండడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండుటెండ, వేడిగాలులు దెబ్బకు బయటకు రావడానికే జంకుతున్నారు. రాత్రయినా గాలిలో వేడి తగ్గకపోవడంతో ఉక్కపోతతో విలవిలాడుతున్నారు.

చిరు వ్యాపారులపై ఎండల దెబ్బ

నగరంలో రహదారుల పక్కన పండ్లు, కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులపై మండుతున్న ఎండలు ప్రభావం చూపుతున్నాయి. తెల్లవారకముందే నగరానికి యాదమరి, తవణంపల్లె, చిత్తూరు రూరల్, గుడిపాల, పెనుమూరు, జీడీ నెల్లూరు తదితర మండలాల నుంచి చిరు వ్యాపారాలకు నగరానికి వస్తారు. బతుకుదెరువు కోసం కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, దానిమ్మ, పనస, అరటి పండ్లు, జామకాయలు, బొప్పాయి, దోసకాయల విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తుంటారు. వీరంతా ఇప్పుడు ఎండల తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నా తప్పని పరిస్థితుల్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రత మూలాన వడదెబ్బ భయం పొంచి ఉంది.

రెండు నియోజకవర్గాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

చిత్తూరు నియోజకవర్గం

చిత్తూరు నగరం : 37 డిగ్రీలు
గుడిపాల మండలం : 39 డిగ్రీలు

పూతలపట్టు నియోజకవర్గం

పూతలపట్టు : 37 డిగ్రీలు
తవణంపల్లె :37 డిగ్రీలు
బంగారుపాళ్యం: 34 డిగ్రీలు
ఐరాల: 30 డిగ్రీలు
యాదమరి : 37 డిగ్రీలు

జాగ్రత్తలు వహించండి

అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు జాగ్రత్తలు ముఖ్యంగా పాటించాలి. శరీర ఉష్ణోగ్రత 105.1 కంటే ఎక్కువగా ఉండటం, చర్మం పొడి బారడం వంటి లక్షణాలున్న వారు నీళ్లు ఎక్కువగా తాగాలి. శరీరాన్ని అన్ని వేళలా చల్లగా ఉంచేందుకు చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవడం మంచిది. వృద్ధులు, చిన్నారులు మండుటెండల్లో బయటకు రాకుండా ఉండటమే శ్రేయస్కరం. ప్రధానంగా రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు, ప్రజలు తప్పనిసరై బయటకు వెళ్లాల్సి వస్తే.. గొడుగు, తలకు టోపీ ధరించి వెళ్లాలి. మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయలతో చేసిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, వడదెబ్బ తగలకుండా మరింత అప్రమత్తంగా ఉండాలి.



– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మెడికలాఫీసర్

ఘనంగా ఉగాది వేడుకలు



తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది పంచాగ శ్రవణం

బంగారుపాళెం: మండలంలో తెలుగు ప్రజలు మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రధాన ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మొగిలి శివాలయం, మొగిలి వెంకటగిరిలోని శ్రీకోదండ రామాలయం, నలగాంపల్లెలోని శ్రీభూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, వజ్రాల పురంలోని జలకంఠేశ్వర స్వామి ఆలయం, గంగమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సర్వశుభాలు కలగాలని భక్తులు పూజలు చేపట్టారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్ధగిరి క్షేత్రంలో పంచాగ శ్రవణం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని అర్చకులు పంచాగ శ్రవణం చేపట్టారు. మంగళవారం స్వామివారికి అభిషేకం పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు సంపత్ ఉత్సవ విగ్రహానికి అభిషేకం, పూజలు చేయించి పంచాంగ శ్రవణం చదివి భక్తులకు వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంచిపెట్టారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల వ్యాప్తంగా సోమవారం ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. కుల దేవతలకు పూజలు చేశారు. ఉగాది పచ్చడి స్వీకరించారు అలాగే నగరంలోని ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఉత్సవ మూర్తిని అలంకరించి మండపంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు.

ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో..

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. వేదపండితులు పంచాగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రోషన్ బాషా, హరి, సురేష్‌బాబు, బాలాజీ, మురాద్‌బాషా, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో ఇందుమతి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద, తొప్పాతిపల్లెలో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధనకొండ గంగమ్మను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ పూజలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి హాజరై అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వైస్ ఎంపీపీ రంజని, నాయకులు మణిబాబుపిళ్లై, కుమార్, వెంకటేష్, జయపాల్‌నాయుడు, రాజేంద్ర, బాబు, తులసి, తేజస్ పాల్గొన్నారు.



చిత్తూరు రూరల్: ఈశ్వరగుడివీధిలో..



బంగారుపాళెం: ముత్యాలమ్మ ఆలయంలో..



అమ్మవారిని దర్శించుకుంటున్న ఇందుమతి